ఆదమరిస్తే అంతే సంగతి..

- రోడ్లపైనే భారీ వాహనాల పార్కింగ్
- తరచూ ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు


ఖానాపూర్-కాలూరు రోడ్డుపై నిలిచిన భారీ వాహనాలు

నిజామాబాద్ రూరల్: రోడ్డుపై నిర్లక్ష్యంగా నిలిపిన వాహనాలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వాటిని గమనించకుండా పలువురు వాహనదారులు ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..
నగర పరిధిలోని 1వ డివిజన్ ఖానాపూర్, కాలూర్ గ్రామ శివార్లలో అనేక రైస్‌మిల్స్, ఇతర పరిశ్రమలు ఉన్నాయి. ఈక్రమంలో నిత్యం ఆయా పరిశ్రమలకు భారీ వాహనాలు, ధాన్యం లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. కానీ రైస్‌మిల్లుల్లోకి వచ్చే ధాన్యం బస్తాల లారీలు, భారీ వాహనాలను రోడ్లపై నిర్లక్ష్యంగా నిలిపివేడయంతో తోటి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పలువురు వాటిని గమనించకుండా ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. 15రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృత్యువాతపడ్డారు. ఖానాపూర్, కాలూర్ రహదారిపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రద్దీగా ఉండే ఈ రోడ్డుపై వాహనాలు నిలిపి ఉంచడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైస్‌మిల్స్ యజమానులు, భారీ వాహనాల డ్రైవర్ల నిర్లక్ష్యంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై భారీ వాహనాలు నిలపకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే ఆ ప్రాంతంలో ఉన్న రైస్‌మిల్స్ యజమానులు, లారీ డ్రైవర్లకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

నడిరోడ్డుపై వాహనాలు నిలిపితే డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రతి రైస్‌మిల్ ఎదుట విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసుకోవాలి. లేదంటే రైస్‌మిల్ యజమానులకు, లారీ ఓనర్లకు నోటీసులు అందిస్తాం. ప్రయాణికులకు ఇబ్బంది కల్గించే విధంగా వాహనాలను పార్కింగ్ చేస్తే చర్యలు తప్పవు. –ఆరీఫ్, రూరల్ ఎస్‌హెచ్‌వో

మేదరులను ప్రభుత్వం ఆదుకోవాలి


నగరంలో కేతేశ్వరస్వామి విగ్రహానికి పూలమాల వేసి, నినాదాలు చేస్తున్న మేదరులు

నిజామాబాద్ నాగారం: ఉపాధి కరువై ఇబ్బందులు పడుతున్న మేదరులను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా మెదరి సంఘం అధ్యక్షుడు దర్శనం దేవేందర్ అన్నారు. బుధవారం ప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా వినాయక్‌నగర్‌లోని అమరవీరుల పార్క్‌లో మేదరి కులదైవం కేతేశ్వరస్వామి విగ్రహానికి సంఘ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం దేవేందర్ మాట్లాడుతూ.. చేతినిండ పనులు లేక ఇతర పనులు చేయలేక మేదర కుటుంబాలు దుర్భరజీవితాలు గడుపుతున్నాయన్నారు. ప్రభుత్వం మేదరుల కోసం మేదర ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుచేయలన్నారు. మేదరి నిరుద్యోగ యువతకు స్కిల్‌డెవలప్‌మెంట్ కింద శిక్షణ ఇస్తు వారికి వందశాతం రుణసదుపాయం సబ్సిడీ కింద ఇవ్వాలన్నారు. మేదరులు తయారుచేసిన వెదురు పనిముట్లను అమ్ముకొనుటకు ప్రభుత్వ మార్కెట్ సముదాయాలలో షాపులు కేటాయించాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ, అటవీ భూమిలో వంద ఎకరాల్లో వెదురు మొక్కలు పెంచి, అట్టి మెదురును మేదరులకు ఉచితంగా ఇవ్వాలన్నారు. మేదరుల ఆత్మగౌరవం కోసం జిల్లా కేంద్రంలో స్థలం కేటాయించి భవన నిర్మాణం కోసం నిధులు కేటాయించాలన్నారు. సంఘ ప్రతినిధులు పోశాద్రి, గంగాధర్, సుదర్శన్, గట్టు గంగాధర్, సురినిడి బాబురావు, ఎనుగందుల లక్ష్మీనారాయణ, నరేందర్, ఇందూర్ నరేష్, వేముల రిషి కుమార్ ఉన్నారు.

క్షేత్రస్థాయిలో వరి పంటల పరిశీలన




జక్రాన్‌పల్లిలో వరి పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు.. మెంట్రాజ్‌పల్లిలో..

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలో బుధవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో వరి పంటలను పరిశీలించారు. ఈ నెల 16న రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్తలు పంటలను పరిశీలించి అందులోని లోపాలను గుర్తించాలని సూచించారు. అందులో భాగంగా శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పర్యటించారు. పంటలపై సుడిదోమ, కంకినల్లి ఆశించినట్లు గుర్తించామని ఏవో దేవిక తెలిపారు. సుడిదోమ నివారణకు ట్రిఫ్లూమేజోపైరిము, కంకినల్లి నివారణకు స్పైరోమిసీఫిరాన్, ప్రొఫికోనోజోల్ కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. అర్గుల్ సొసైటీ చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి, ఏఈవో శ్రీకాంత్, రైతులు రిక్కల సురేష్, శేఖర్ తదితరులు ఉన్నారు.

డిచ్‌పల్లి మండలంలో..
డిచ్‌పల్లి: మండలంలోని మెంట్రాజ్‌పల్లి, ధర్మారం(బి) గ్రామాల్లో బుధవారం ఏవో సుధామాధురి పర్యటించిన వరి పంటలను పరిశీలించారు. వరిలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు, సుడిదోమ, ఆకు ముడత, అగ్గి తెగులు రోగాలు వచ్చినట్లు గుర్తించామన్నారు. బ్యాక్టీరియా ఎండాకు తెగులును నివారించడానికి తొలిదశలో నత్రజని ఎరువును వేయడం తాత్కాలికంగా ఆపివేయాలన్నారు. అనంతరం ఎకరానికి కాపర్ హైడ్రాక్సైడ్ 400 గ్రా. స్ట్రెప్టమైసిన్ 60 గ్రాములు వాడితే తెగులు సోకకుండా నివారించవచ్చని ఆమె సూచించారు.

బీజేపీ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నిజామాబాద్ అర్బన్: కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీపై బీజేపీ నాయకులు చేసిన వ్యాఖ్యలకు నిరసిస్తూ బుధవారం నగరంలో బీజేపీ దిష్టిబొమ్మను ఎన్ఎస్‌యూఐ నాయకులు దహనం చేశారు. నాయకులు గడుగు రోహిత్, వేణురాజ్, నిఖిల్‌రెడ్డి, రాహుల్ పాల్గొన్నారు.


సంక్షిప్తం

బాధిత కుటుంబాలకు పరామర్శ




డిచ్‌పల్లి: మండలంలోని పలు గ్రామాల్లోగల బాధిత కుటుంబాలను బుధవారం మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, మాజీ జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నాయకులు శక్కరికొండ కృష్ణ, నల్లవెల్లి సాయిలు, నీరడి పద్మారావు, ఒడ్డెం నర్సయ్య, రాజు, ఆనంద్, లింగం యాదవ్, సుదాం, బక్కన్న, తెలు సరిత, బుచ్చమ్మ, యశోధ, సుమలత, ప్రభాకర్, సత్యనారాయణ, కిషోర్, మహ్మద్ అర్షద్, చాకటి భరత్, సుధీర్, ప్రభుదాస్ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



నిజామాబాద్‌అర్బన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి అన్నారు. నగరంలోని గిరిరాజ్ కళాశాలలో బుధవారం జాతీయ సేవా పతాకం ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ఆవరణను శుభ్రపరిచారు. మొక్కలు నాటారు. వైస్ ప్రిన్సిపాల్ అబ్దుల్‌రఫీ, వెంకటరమణ, సుధాకర్ నాగజ్యోతి, నరేష్ కుమార్ పాల్గొన్నారు.

ధర్పల్లిలో..



ధర్పల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులు కళాశాల ఆవరణను శుభ్రం చేశారు. ప్రిన్సిపాల్ జ్యోతి, కుమారస్వామి, శ్రీరాం, ప్రభాకర్, రవిరాజ్, రాంచందర్, సంజీవ్‌కుమార్, గంగాధర్, శారద, పద్మ పాల్గొన్నారు.

సెప్టెంబర్ 17 ముమ్మాటికీ తెలంగాణ విద్రోహ దినమే
మోపాల్: సెప్టెంబర్ 17 ముమ్మాటికీ తెలంగాణ విద్రోహ దినమేనని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) జిల్లా నాయకులు సాయాగౌడ్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 17 తెలంగాణ సాయుధ పోరాటానికి, ప్రజల విజయాలకు విద్రోహం జరిగిన రోజన్నారు. నిజాం, పటేల్, నెహ్రూ సైన్యం కుమ్మక్కై తెలంగాణ ప్రజలకు ద్రోహం చేశారని ఆరోపించారు. నాయకులు మురళీ, రాజేందర్, మోహన్, రాందాస్, సుగుణ, లక్ష్మీ, గంగాధర్, సుజాత పాల్గొన్నారు.

క్లుప్తంగా

డీఈవో కార్యాలయ స్థలాన్ని కోర్టుకు కేటాయించండి

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని పాత డీఈవో కార్యాలయ స్థలాన్ని జిల్లా కోర్టు అవసరాలకు అనుగుణంగా కేటాయించాలని నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్‌గౌడ్ కోరారు. ఈమేరకు బుధవారం ఆయన బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కోర్టులో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులకు ఓపెన్ స్థలం లేకపోడంతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈమేరకు పాత డీఈవో కార్యాలయ ఖాళీ స్థలం జిల్లా కోర్టుకు కేటాయించేవిధంగా కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

రహదారికి మరమ్మతులు



సిరికొండ: మండలంలోని కొండాపూర్ అటవీ ప్రాంతంలో కోతకు గురైన రోడ్డుకు బుధవారం కొండాపూర్, తూంపల్లి గ్రామస్తులు మరమ్మతులు చేపట్టారు. రెండు గ్రామాల వీడీసీల ఆధ్వర్యంలో మొరం పోసి గుంతలను పూడ్చారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు కోతకు గురై భారీ గుంత ఏర్పడింది. దీంతో ఆ మార్గంలో భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈమేరకు కోతకు గురైన రోడ్డు వద్ద రెండు గ్రామాల వీడీసీలు సొంత డబ్బులతో మొరం పోసి చదును చేశారు. రోడ్డును బాగు చేసిన విషయం కామారెడ్డి డిపో వారికి సమాచారం ఇవ్వగా గురువారం నుంచి బస్సులను పునరుద్ధరిస్తామని తెలిపారని ఆ గ్రామస్తులు తెలిపారు.

పీడీఎస్‌యూ లోగో ఆవిష్కరణ



నిజామాబాద్ సిటీ/నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు ఆవరణలో బుధవారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) 50 వసంతాల సందర్భంగా స్వర్ణోత్సవ సభల లోగోను సంఘ నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పీడీఎస్‌యూ స్వర్ణోత్సవాలు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో సెప్టెంబర్ 30న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో సైతం నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వర్ణోత్సవాలకు విద్యార్థులు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. నాయకులు సుధాకర్, సాయికుమార్, సీతయ్య, ప్రేమ్ సింగ్, అరవింద్, భాస్కర స్వామి, చంద్రశేఖర్, సంధ్య, ప్రగతి, నసీర్, నర్సింలు పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయండి



తెయూ(డిచ్‌పల్లి): హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో ఈనెల 21న నిర్వహించనున్న 'అఖిల భారత మహిళా విద్యావేత్తల మహా సమ్మేళనం' సదస్సును విజయవంతం చేయాలని ఏబీఆర్ఎస్ఎం మహిళా అధ్యాపకులు కోరారు. తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్‌తోపాటు వర్సిటీ పరిధిలోని డిగ్రీ, పీజీ కళాశాలలను బుధవారం వారు సందర్శించారు. ఆయా కళాశాలల మహిళా అధ్యాపకులతో సమావేశాన్ని నిర్వహించి సదస్సు ఉద్దేశాలను తెలియజేశారు. సదస్సుకు తప్పక హాజరు కావాలని మహిళా అధ్యాపకులను కోరారు. అనంతరం సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు.

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన తపస్ మహిళా టీచర్ల సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న మహిళా విద్యావేత్తల సమ్మేళనానికి తప్పకుండా హాజరుకావాలని మహిళా అధ్యాపకులు ఆయనను కోరారు.

పుస్తకం హస్త భూషణం



నిజామాబాద్‌నాగారం: చేతికి పుస్తకాలు ఆభరణం వంటివని సామాజిక రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రేమ్‌లాల్ అన్నారు. వినాయక్‌నగర్‌లోని సంఘం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ మేధావి, రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ కూడా పుస్తక ప్రియుడన్నారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం చేసేలా ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. సంఘ సభ్యులు బాబురావు, రమేష్, ప్రవీన్‌లాల్ తదితరులున్నారు.

20న ఉద్యోగ మేళా

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ ఉద్యోగాల కోసం ఈనెల 20న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి మధుసూదన్ రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎంఆర్ షాపింగ్ మాల్, బీఎఫ్ఐఎల్ కంపెనీల వారు నిజామాబాద్, మేడ్చల్‌లో ఉద్యోగాల కోసం నియామకాలు చేపడుతున్నారని అన్నారు. ఇందులో భారత్ మనీ ఆఫీసర్, ఫ్లోర్ సూపర్‌వైజర్, సేల్స్‌మన్, రిసీవింగ్ స్టాఫ్, సెక్యూరిటీ స్టాఫ్, ఐటీ ఎగ్జిక్యూటివ్ పోస్టులు ఉన్నాయని, వీటికి పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన వారు అర్హులన్నారు. వివరాలకు 95817 68413, 99487 48428, 63057 43423, 77022 59070ను సంప్రదించాలన్నారు.

20 నుంచి పీజీ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పీజీ మొదటి సంవత్సరం పరీక్షలు ఈనెల 20 నుంచి ప్రారంభమవుతాయని కో- ఆర్డినేటర్ రంజిత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్‌తో పాటు గుర్తింపు కార్డు తీసుకు రావాలన్నారు. పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయని అన్నారు. మరిన్ని వివరాలకు 7382929612నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నగరంలో నేడు వంటల పోటీలు



నిజామాబాద్‌నాగారం: నగరంలో నేడు (గురువారం) టేస్టీ తెలంగాణ ట్రీట్స్ వంటల పోటీలు నిర్వహించనున్నామని ఇన్ఫినిటీ కళాశాల హోటల్ మేనేజ్మెంట్, ఫ్యాషన్ డిజైనింగ్ ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ రత్నాకర్ పేడూరి అన్నారు. నగరంలోని ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం ఉదయం 10గంటలకు కంఠేశ్వర్‌బైపాస్‌రోడ్‌లోని హోటల్‌మేనేజ్‌మెంట్‌లో 18నుంచి 32 ఏళ్లలోపు మహిళలకు వంటల పోటీలు తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనే వారికి ఉచిత ఎంట్రీ ఉంటుందని, వారు చేసే వంటకాల సామగ్రి తెచ్చుకోవాలని అన్నారు. విజేతలకు బహుమతులు అందించి, హైదారాబాద్‌లో జరిగే ఫైనల్ పోటీలకు పంపనున్నామన్నారు. ఇతర వివరాలకు కళాశాలలో గాని, 81061 82233ను సంప్రదించాలన్నారు.

ఆధ్యాత్మికం

ప్రశాంతంగా వినాయకుల నిమజ్జనం



సిరికొండ: మండల కేంద్రంలో వినాయక విగ్రహాల నిమజ్జనం బుధవారం ప్రశాంతంగా కొనసాగింది. నిమజ్జన శోభా యాత్రలో యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం స్థానిక చెరువులక్ష విగ్రహాలను నిమజ్జనం చేశారు.

భక్తిశ్రద్ధలతో యజ్ఞం



నిజామాబాద్ రూరల్: నగరంలోని వినాయకనగర్ మున్నూరుకాపు సంఘం వినాయక కల్యాణ మండపంలో బుధవారం ఓమౌజయా శ్రీపరబ్రహ్మ యజ్ఞాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పరమోజీ బ్రహ్మ శాస్త్రజ్ఞ, పరమోజీ త్రిగుణాత్మక సిద్ధ, పరమోజీ శ్రీఋషి ప్రజ్ఞానంద స్వామీజీ, పరమోజీ యోగి అచల ఆధ్వర్యంలో యజ్ఞం నిర్వహించారు. అలాగే పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొని, మాట్లాడారు. ఓమౌజయా శ్రీపరబ్రహ్మ యజ్ఞంకు సంబంధించిన మాసపత్రికను ఆవిష్కరించారు.

వైభవంగా సత్యనారాయణస్వామి వ్రతం
సిరికొండ: మండలంలోని తాళ్లరామడుగు చౌరస్తా వద్ద గల రామాలయంలో బుధవారం పౌర్ణమిని పురస్కరించుకొని భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి పౌర్ణమి నాడు ఎలాంటి ఖర్చులు లేకుండా ఈ వ్రతంలో ఎవరైనా దంపతులు వచ్చి పాల్గొనవచ్చని ఆలయ కమిటీ చైర్మన్ పురుషోత్తం గుప్తా తెలిపారు.

ప్రతి ఒక్కరికీ ఓటరు జాబితా చేరాలి

- మున్సిపల్ కమిషనర్ మంద మకరందు


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మంద మకరందు

నిజామాబాద్ సిటీ: ఓటరు జాబితాను మున్సిపల్ సిబ్బందితో డివిజన్ల వారీగా పంపిస్తామని, ప్రతీ ఓటరుకు వారి జాబితా చేరాలా చూడాలని మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్ సూచించారు. జిల్లాకేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆయన మున్సిపల్ సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో ఏవైనా తప్పులు దొర్లితే వాటిని సవరించాలని ఆదేశించారు. నగరంలోని ప్రతి ఓటరుకు తమ ఓటు హక్కుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సిందేనన్నారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నందుకు గడువులోగా ఓటరు జాబితాను సిద్ధం చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. జాబితాలో ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి సూచించారు. ఓటరు జాబితా పంపిణీలో క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వివిధ రాజకీయ పార్టీల నేతలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



నిజామాబాద్‌నాగారం: నగరంలోని చాత్తాద వైష్ణవ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో పట్టణ ఆర్ఎంపీ, పీఎంపీలకు సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ఆరోగ్య విద్యా బోధకులు ఘనపూర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల నియంత్రణలో ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సిబ్బంది సంతోష్, మురళి, పుల్లం మోహన్, శ్రీనివాస్, సత్యనారాయణ, వహీద్, పురుషోత్తం పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలి

ఇందల్వాయి: గ్రామీణ మహిళలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శోభ, హెల్త్ సెంటర్ వైద్యుడు సంతోష్ అన్నారు. మండలంలోని నల్లవెల్లి రైతు వేదికలో బుధవారం పోషన్ అభియాన్ వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో విధులు నిర్వహించే అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పోషకాహారంపై గ్రామీణ మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. హెచ్ఈవో శంకర్, ఎంపీవో రాజ్‌కాంత్, ఏపీవో పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

మెడిసిన్ విద్యార్థికి ఆర్థికసాయం



నిజామాబాద్‌అర్బన్: మెడిసిన్ విద్యను అభ్యసిస్తున్న పేద విద్యార్థి రాజుకు హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ సభ్యులు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చేతుల మీదుగా రూ. 25వేల చెక్కును బుధవారం అందించారు. రాజు కరీంనగర్‌లో ఉన్న చల్మెడ ఆనంద్‌రావు కాలేజీలో వైద్యవిద్య రెండో సంవత్సరం చదువుతున్నాడు. అలాగే ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ రూ. 5వేలు అందించారు. అదనపు కలెక్టర్ కిరణ్, రమణ్‌రెడ్డి, ప్రశాంత్ కుమార్, శ్రీనివాస్‌రావు, విజయేందర్ రెడ్డి పాల్గొన్నారు.

'గల్ఫ్ మృతులకు సాయంపై హర్షం'

సిరికొండ: గల్ఫ్ మృతులకు రూ.ఐదు లక్షల పరిహారం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంపై కాంగ్రెస్ నాయకులు బండారి నరేష్ హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం నిర్ణయంతో గల్ఫ్ కుటుంబాలు రోడ్డున పడకుండా ఆదుకున్నట్లు అవుతుందన్నారు. సీఎంకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)		
		డ్రెస్సడ్	160
		లైవ్	100
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	75,900	వెండి (కిలో)	90,600
22 క్యారెట్స్	69,097		– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	20	40	గాజరుగడ్డ	30	50
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	15	30
బీరకాయ	60	80	దోసకాయ	20	40
దొండకాయ	40	60	ఆలుగడ్డ	30	50
బీర్నీసుకాయ	120	150	గోబిగడ్డ	20	40
కాకరకాయ	50	80	గోబిపువ్వు	30	50
వంకాయ	40	60	బీట్‌రూట్	30	50
పాలకూర	90	140	కరివేపాకు	40	60
మెంతికూర	90	140	చామగడ్డ	40	60
కొత్తిమీర	150	200	గోరుచిక్కుడు	30	50
పుదీనా	70	90	చిక్కుడుకాయ	70	100
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	సరిపోదా శనివారం - 1.15,7.15 ఉత్సవం(తెలుగు)- 4.20 35 చిన్నకథ(తెలుగు)-10.30
స్క్రీన్-2	భలే ఉన్నాడే -10.30,7.25 మత్తు వదలరా(తెలుగు)-1.30 ఎ.ఆర్.ఎం.3డీ(తెలుగు)-4.20 10.20
స్క్రీన్-3	35 చిన్నకథ - 10.50,1.50,7.30 మత్తు వదలరా-2(తెలుగు)-10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ప్రేమికుడు(తెలుగు)-10.00 మత్తు వదలరా-2-1.30,7.45, 10.45 స్త్రీ(హిందీ)-4.30
స్క్రీన్-2	ఎ.ఆర్ఎం.3డీ(తెలుగు)-12.15, 7.00 సరిపోదా శనివారం -3.25,10.10
స్క్రీన్-3	భలే ఉన్నాడే(తెలుగు)-10.25,7.30 చిన్నకథ కాదు(తెలుగు)-1.25,10.30 మత్తు వదలరా-2(తెలుగు)-4.30
స్క్రీన్ -4	ఉత్సవం(తెలుగు)-11.00,7.15 తుంబడ్(తెలుగు)-2.00 కళింగ(తెలుగు)-4.40
లలితామహల్	సరిపోదా శనివారం (తెలుగు)
దేవి	మత్తు వదలరా-2 (తెలుగు)
నటరాజ్	భలే ఉన్నాడే (తెలుగు)
విజయ్	ఎ.ఆర్.ఎం 3డీ (తెలుగు)